## క్లుప్తంగా

### పరిశోధకుడికి డాక్టరేట్



మార్తల పవన్‌కుమార్‌రెడ్డి

వైవీయూ : యోగివేమన విశ్వ విద్యాలయం తెలుగుశాఖ పరిశోధకుడు మార్తల పవన్‌కుమార్‌రెడ్డికి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు తప్పెట రామప్రసాదరెడ్డి పర్యవేక్షణలో 'ఒక దశాబ్దపు రాయలసీమ నవలలు – సాంఘిక, సాంస్కృతిక జీవనం' (1981 నుండి 1990 వరకు)' అన్నఅంశంపై ఈయన చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. కడప జిల్లా సింహాద్రిపురం మండలం బి. కొత్తపల్లికి చెందిన ఈయన 2019 యూజీసి జెఆర్ఎఫ్ ద్వారా పీహెచ్‌డీ ప్రవేశం పొందారు.

### రిమ్స్ లో సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రిమ్స్ హాస్పిటల్‌లో సమస్యలు పరిష్కరించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి కోరారు. బుధవారం రిమ్స్ ఆసుపత్రిని ఆర్‌సీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తాళాలకే పరిమితమైందని, అందులో పని చేయటానికి సిబ్బంది, వైద్య పరికరాలు లేవన్నారు. ఓపీలోని ఎక్స్‌రే, సిటీ స్కానింగ్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ లో వర్క్ స్టేషన్ రిపోర్టింగ్ సిస్టం, టెక్నీషియన్స్, డేటా ఆపరేటర్లు, అర్హత కలిగిన వైద్యులను నియమించాలన్నారు. ఇంకా పలు సమస్యలు ఉన్నాయని, అన్నింటినీ పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి మక్బుల్‌బాషా, ఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిరామయ్య, రాయలసీమ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తస్లీమ్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

### 6న జాబ్‌మేళా

కడప ఎడ్యుకేషన్ : కడప రిమ్స్‌రోడ్డులో గల స్పిరిట్ డిగ్రీ అండ్ పీజీ(ఎంబిఏ అండ్ ఎంసీఏ) కళాశాలలో ఈనెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఎస్ఎండీ మునీర్ తెలిపారు. ఈ మేళాను హైదరాబాదుకు చెందిన ఎం/ఎస్ కేడర్ కెరియర్స్ సంస్థ తరపున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు అభ్యర్థులు ఏదైనా డిగ్రీ లేక పీజీ ఉత్తీర్ణులై 30 సంవత్సరాల లోపు వయసు ఉండాలని తెలిపారు. వివరాలకు 98852 50955 నెంబర్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

### వ్యాసరచనలో విజేతలు వీరే

కడప కల్చరల్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న నిర్వహించిన యోగా దినోత్సవ వ్యాసరచన పోటీలో విజేతల జాబితాను సంస్థ నిర్వాహకులు ప్రొఫెసర్ జీవీ శేషారెడ్డి, డాక్టర్ ఊర్మిలాదేవిలు తెలిపారు. విశ్వాత్మ పిరమిడ్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలో 8వ తరగతికి చెందిన ఓ.ప్రియవదన, 10వ తరగతి విద్యార్థిని శ్రీశైల, 9వ తరగతి విద్యార్థి టి.శ్రీజలు విజేతలుగా నిలిచారన్నారు. వీరికి త్వరలో ప్రశంసాపత్రం, బహుమతులు అందజేస్తామని తెలిపారు.

### ఎంఈఓకు సన్మానం



ఎంఈఓ దిద్దకుంట గంగిరెడ్డిని సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప ఎంఈఓ-1(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు స్వీకరించిన దిద్దకుంట గంగిరెడ్డిని ఎస్టీయూ కడప నగరశాఖ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా నూతన ఎంఈఓ గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ముందుంటానని, మీరు కూడా మీ సహాయ సహకారాలను అందించి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్, నగరపాలక స్కూల్స్ సూపర్‌వైజర్ ఫరూక్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండి ఇలియాస్ బాష, నగర అధ్యక్షులు సాధిక్అలీ, ప్రధాన కార్యదర్శి సంజీవరాయుడు, ఆర్థిక కార్యదర్శి ఆస్లం, జిల్లా నాయకులు నజీబుల్లా, ఫక్రుద్దీన్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

### కడప మండల విద్యాశాఖ అధికారి-1గా గంగిరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కడప మండల విద్యాశాఖ అధికారి-1 (ఏఎఫ్‌సీ)గా దిద్దుకుంట గంగిరెడ్డి బుధవారం కడప ఎమ్మార్సీలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం చెన్నూరు మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్నారు. అయితే కడప మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న పాలెం నారాయణ ఇటీవల పదవీ విరమణ చేశారు. దీంతో ఆయన స్థానంలో చెన్నూరు మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న దిద్దుకుంట గంగిరెడ్డిని ఎఫ్ఏసీ ఎంఈఓగా డీఈఓ నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

### నేడు భూముల వేలం

రాజుపాళెం : మండలంలోని పగిడాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, ఈశ్వర, రామాంజనేయ దేవస్థానాలకు సంబంధించిన భూములను గురువారం వేలం వేయనున్నట్లు ఆలయ ఈఓ రామచంద్రాచార్యులు తెలిపారు. ఈ వేలంపాట ప్రొద్దుటూరులోని నారాయణ రంగయ్యగారి సత్రంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# ముచ్చటైన రాత... ముత్యాల కలబోత


- అందమైన దస్తూరికి ఆదరణ
- మంచి రాత కోసం ప్రత్యేక శిక్షణ

కడప కల్చరల్ : అందమైన దస్తూరి మనకు ప్రత్యేక గుర్తింపును తెస్తుంది. గుండ్రటి రాత మనపై మంచి అభిప్రాయాన్ని కలిగిస్తుంది. ముచ్చటైన అక్షరాలు మనకు మంచి మార్కులను తెచ్చి పెడతాయి. మొత్తంపై మంచి దస్తూరి మనకు ఎంతో మేలు చేస్తుంది.

■ వందల సంవత్సరాల నుంచి సమాజంలో అందమైన దస్తూరికి ఆదరణ ఉంది. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమైంది. విద్యార్థులు చదువులో బిజీ అయ్యారు. ఇప్పటివరకు చేతిరాత ఎలా ఉన్నా ఇప్పటి నుంచైనా సాధన మొదలు పెడితే మూడు నెలల్లో ముచ్చటైన రాతను సాధించవచ్చునని నిపుణులు తెలుపుతున్నారు.

■ ముత్యాలు తెల్లగా, గుండ్రంగా, స్వచ్ఛంగా మెరుస్తూ అందరినీ ఇట్టే ఆకట్టుకుంటాయి. అందుకే అందమైన చేతి రాతను ముత్యాలు, రతనాలతో పోలుస్తారు. కొందరు దస్తూరి వస్తాదులు రాస్తే తెల్ల కాగితంపై ముత్యాలు దొర్లించినట్లే ఉంటాయి. ఇటీవలి కాలంలో విద్యార్థుల చేతి రాతకు ప్రాధాన్యత పెరిగింది. తల్లిదండ్రులు కూడా దీనికి ఎంతో విలువనిస్తున్నారు. పిల్లల చేతిరాత బాగా లేకుంటే ప్రత్యేకంగా క్యాలిగ్రఫీ నిపుణులతో నెలల తరబడి శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇందుకోసం అయ్యే ఖర్చుకు వెనుకాడటం లేదు. మొత్తంపై వారి పట్టుదల, విద్యార్థుల సాధనతో పరీక్షల్లో అక్షరాలు అందంగా రాసి మంచి మార్కులు సాధిస్తున్నారు. బాగా రాసే వారిని చూసి పక్క వారిలో కూడా అక్షరాలను అందంగా రాయాలన్న పట్టుదల విస్తరిస్తోంది.

■ కొన్ని పాఠశాలల్లో ప్రత్యేకంగా అందమైన చేతి రాతను నేర్పేందుకు ప్రత్యేకంగా తరగతులను నిర్వహిస్తున్నారు. చేతి రాత నిపుణులను నియమించి వీలైనంతమంది విద్యార్థులు అందంగా రాసేలా ప్రయత్నిస్తున్నారు. మిగతా వారితో పోలిస్తే అందంగా రాసే విద్యార్థులకే మంచి మార్కులు వస్తాయన్న విశ్వాసంతో ఆకర్శణీయమైన రాతకు ఆదరణ బాగా పెరుగుతోంది.



18వ శతాబ్దం నాటి తెలుగు రాత

**ప్రత్యేక సాధన..**


అందమైన చేతి రాతను ఇప్పుడు ఆ రంగంలో నిపుణులేగాక సాధారణ ఉపాధ్యాయులు సైతం విద్యార్థులకు నేర్పగలుగుతున్నారు. కాపీ రైటింగ్ పుస్తకాలను తెప్పించి ముందులా రోజుకు ఒకటి, రెండు పేజీలుగాక కేవలం రెండు, మూడు లైన్లు మాత్రమే అందంగా, పొందికగా రాయాలని చెబుతుండడంతో శిక్షణ సులభంగా అనిపించి విద్యార్థులు అందమైన రాత కోసం మొగ్గుచూపుతున్నారు.



1846లో బ్రౌన్ స్వయంగా రాసిన లేఖలోని దస్తూరి

■ పాఠశాలలో ఒక పీరియడ్‌లో కొద్దిసేపు మంచి దస్తూరి కోసమే కేటాయిస్తున్నారు. పట్టుదల ఉంటే కేవలం రెండు, మూడు నెలలలోపుగానే అందమైన దస్తూరి రాయగలుగుతుండడంతో పక్క విద్యార్థులలో కూడా ఉత్సాహం పెరుగుతోంది. అలా అందంగా రాస్తున్న విద్యార్థులను చూసి తల్లిదండ్రులు ఆనందించడమే కాకుండా చుట్టుపక్కల వారికి కూడా చూపి గర్విస్తున్నారు. ఇంటిలో ఒక విద్యార్థి ముచ్చటైన రాత రాయగలిగితే మిగతా పిల్లలు కూడా అలాగే రాసే అవకాశం, వాతావరణం ఉంటుందని పెద్దలు భావించి పిల్లలను ప్రోత్సహిస్తున్నారు.

■ తన చేతి రాత బాగుండదని, దక్షిణాఫ్రికాకు వెళ్లాక అక్కడి ప్రజల చేతిరాతను చూసి ముగ్ధుడిని అయ్యానని, ఆ సమయంలోనే తన చేతి రాత బాగా లేదని అర్థమైందని మహాత్మాగాంధీ అన్నారు. విద్యార్థి దశలోనే మంచి రాతను సాధించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.



ఓ విద్యార్థి రాసిన చూడచక్కని చేతి రాత

**నిన్నమొన్నటి తరాల్లో..**

అందమైన చేతి రాతకు ఇటీవల ఆదరణ పెరిగిందని అందరం భావిస్తున్నాం. కానీ మూడు, నాలుగు వందల సంవత్సరాల క్రితమే అందమైన చేతిరాతకు ప్రాధాన్యత ఉండేదని తెలుస్తోంది. కాగితం లేక ముందు కేవలం తాటి ఆకులపైనే కావ్యాలు, ఇతర రచనలు చేసేవారు. ఆ ఆకులపై రాయడం కష్టమే అయినా అందులోని అక్షరాలు ఎంతో అందంగా కనిపిస్తాయి. అలా గుండ్రంగా, అందంగా రాసేందుకు ప్రత్యేకంగా నిపుణులైన రాతగాళ్లు ఉండేవారని, వారిని వ్రాయసగాళ్లు అనేవారు. ఇంగ్లీషు దొర కల్నల్ మెకంజీ రాయించిన కైఫీయత్తుల్లో దస్తూరి ఎంతో అందంగా ఉండడం విశేషం. తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ చేతి రాత కూడా చాలా ముచ్చటగా ఉండేదని బ్రౌన్ గ్రంథాలయంలోని పుస్తకాల ద్వారా తెలుస్తోంది. మరి మనమెందుకు మంచి దస్తూరిని సాధించలేం. మనం కూడా సాధన చేస్తే తప్పకుండా మంచి దస్తూరి సొంతం చేసుకోవచ్చు.

### సత్యదేవుని సన్నిధిలో జేసీ



స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న జేసీ గణేష్‌కుమార్

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయానికి బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ విచ్చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్ల మూలమూర్తులు, ఉత్సవమూర్తులను దర్శింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర, విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా జేసీకి తీర్థ ప్రసాదాలు, వేదాశీస్సులు అందజేసి స్వామి, అమ్మవార్ల శేష వస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో పుష్పగిరి తీర్థ క్షేత్ర అభివృద్ధి సంస్థ నిర్వాహకులు, న్యాయవాది సట్టి భారవి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### నేడు ఉచిత వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : మైదుకూరులోని సునీల్ ఫిజియోకేర్‌లో గురువారం ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కడపకు చెందిన సురక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప నగరంలోని మాతృశ్రీ ఐవీఎఫ్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అపాయింట్‌మెంట్ కోసం 79956 29110 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## నీటి సమస్య, అనుమతులు లేని లే అవుట్‌లపై చర్చించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నేడు జరగబోయే కడప నగరపాలక సంస్థ జనరల్ బాడీ సమావేశంలో నగర పరిధిలోని తాగునీరు, అక్రమ భవంతుల నిర్మాణాలపై సమర్ధవంతమైన చర్చ జరిపి తగు నిర్ణయాలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా పేర్కొన్నారు. బుధవారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో నేటికీ అక్కాయపల్లి, రవీంద్ర నగర్, నబీకోట తదితర ప్రాంతాల్లో రెండు రోజులకు మూడు రోజులకు మంచినీరు వస్తున్నదన్నారు. కడప నడిబొడ్డులో పోలీస్ సంక్షేమ స్థలంలో అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు.

నగర శివారు ప్రాంతాలలో విచ్చలవిడిగా అక్రమ లే అవుట్‌లు నిర్మించి భవంతులు నిర్మిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అమృత్ స్కీం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, బుగ్గ వంక సుందరీకరణ పనులు, టీడ్కో ఇండ్లు పంపిణీ, నగరంలో నిర్మిస్తున్న కూడళ్లు, జనరల్ ఫండ్ నిధులు ఖర్చు చేయడంపై అర్థవంతమైన చర్చ జరగాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కే.మునయ్య, ఎస్ గౌస్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన



మాట్లాడుతున్న శివారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన బాట తప్పదని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఎన్ఎంయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన యూనియన్ సమావేశానికి ముందుగా ఆయన మీడియాతో మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా మరింత జఠిలం చేస్తున్నారన్నారు. సస్పెండ్‌కు గురైన వారిని తిరిగి విధుల్లో తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడంలో చూపుతున్న శ్రద్ధ సమస్యలను పరిష్కరించడంలో చూపించకపోవడం బాధాకరమన్నారు. డిపోల మేనేజర్లు చేస్తున్న తప్పిదాలకు మౌనం వహించడం ఉన్నతాధికారులకు తగదన్నారు. అనేక సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించకపోవడంతోనే ఉద్యమ కార్యచరణ చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ రీజినల్ కార్యదర్శి సుధాకర్, వివిధ డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజీ కార్యదర్శులు, రాష్ట్ర, జోనల్, రీజినల్ నాయకులు పాల్గొన్నారు.

## నేటి విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి



బంద్ పోస్టర్స్‌ను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నేడు చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పలువురు విద్యార్థి సంఘ నాయకులు కోరారు. ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి నాగరాజు, రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజింగ్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ప్రగతిశీల స్టూడెంట్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు బుధవారం బంద్‌కు సంబంధించిన కరపత్రాలను కడపలోని గాయత్రి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జగదీష్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగమయ్య, చిన్న ఓబులేసు, ప్రేమనాథ్‌రెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకుడు శంకరయ్య సేవలు మరువలేనివి



శంకరయ్య దంపతులను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్న శంకరయ్య విద్యా సేవలు మరువలేవని కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ పేర్కొన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్న శంకరయ్య గత నెల 30వ తేదీ పదవీ విరమణ చేశారు. అయితే ఆయన పదవీ విరమణ సన్మానసభను బుధవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరయ్య దంపతులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు అబీబుల్లా, శ్రీరాములరెడ్డి, పద్మావతి, ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై శ్రీనివాసుడు



లక్ష్మీహయగ్రీవ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



తిరుచ్చి వాహనంపై శ్రీవారిని ఊరేగిస్తున్న భక్తులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్ధవటం రోడ్డులోని శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారిని తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి నీరు వారపోసి కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో లక్ష్మీహయగ్రీవ హోమము, వేదస్వస్తి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, ధనలక్ష్మి, సభ్యులు అనీత్, అంకయ్య, నాగేంద్రకుమార్, గురివిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు పాల్గొన్నారు.

### పరామర్శ



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐఎస్ఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఖాజీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కలుషితమైన నీరు తాగి అస్వస్థతకు గురై కడప రిమ్స్‌లో వైద్య సేవలు పొందుతున్న విద్యార్థులను బుధవారం ఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి రెడ్డెయ్యలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పాఠశాలల్లో ట్యాంకులు ఎలా ఉన్నాయి, మధ్యాహ్న భోజనం చేసే చోట శుభ్రత ఎలా ఉంది, భోజన వస్తువులు శుభ్రంగా ఉన్నాయా లేదా అలాగే నాణ్యమైన కూరగాయలను వాడుతున్నారా లేదా అని ప్రతి రోజు క్షుణంగా పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

### ఐటీఐలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

తొండూరు : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2024-25 సంవత్సరానికి సంబంధించి మొద టి విడతలో భర్తీ కాగా మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తుకు ఆహ్వానిస్తున్నట్లు కళా శాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ 10వ తరగతి పాసైన విద్యార్థులు ఆసక్తిగల వారు ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఆధార్, కులధృవీకరణ పత్రాలు, ఫొటోలతో తొండూరులోని ఐటీఐ కళాశాలలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈనెల 27వ తేదీ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ఆయన తెలిపారు. వివరాలకు 8008982619, 8919216275లను సంప్రదించాలన్నారు.

### ఆర్థిక సాయం

కమలాపురం : స్థానిక జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించబడుతున్న ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ల్యాబ్ సౌకర్యం నిమిత్తం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి రూ.50వేలు చేసిన ఆర్థిక సాయం పట్ల ఆ పాఠశాల హెచ్ఎం ఖాజా పర్వీన్ హర్షం వ్యక్తం చేశారు. బాయ్స్ హైస్కూల్ విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్ అందించడానికి మంగళవారం ఎమ్మెల్యే పాఠశాలకు వచ్చారు. అక్కడున్న ఇంటర్మీడియట్ విద్యార్థినులు తమకు ల్యాబ్ సౌకర్యం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన రూ.50వేలు తన సొంత నిధులు అందిస్తానని, ల్యాబ్ సామగ్రి ఏర్పాటు చేయాలని హెచ్ఎంకు సూచించారు. దీంతో బుధవారం ఆయన రూ.50 వేలు ఆర్థిక సాయం హెచ్ఎంకు అందజేశారు.

### ఘనంగా ప్రదోష కాల పూజ



కాశీవిశ్వేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీ దత్తపీఠంలో త్రయోదశి సందర్భంగా బుధవారం రాత్రి కాశీవిశ్వేశ్వరస్వామికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌కు రుద్రాభిషేకం, నందీశ్వరునికి విశేష అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## మల్లెమాల సేవలు ప్రశంసనీయం



మల్లెమాల వేణుగోపాల్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ మల్లెమాల వేణుగోపాల్‌రెడ్డి వైద్యునిగానే కాకుండా సాహితీ రంగంలో విలక్షణ స్థానాన్ని సాధించారని వైవీయూ పాలక మండలి సభ్యులు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి అన్నారు. మల్లెమాల మొదటి వర్ధంతిని పురస్కరించుకొని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దనరాజు ఆధ్వర్యంలో బుధవారం సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ మల్లెమాల వైద్యసేవలందిస్తూనే సాహిత్యరంగాన్ని వదలకుండా అనేక రచనలు చేశారని, ఎంతో మంది యువ రచయితలకు మార్గదర్శకులయ్యారన్నారు. కొండూరు జనార్దనరాజు, డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి మాట్లాడుతూ సాహిత్య అకాడమీ సభ్యులుగా, అధికార భాషా సంఘం సభ్యులుగా మల్లెమాల తెలుగు భాష, సాహిత్యాలకు సేవలందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మూల అయ్యవారు రెడ్డి, డేవిడ్, విజయ్, సతీష్, గొబ్బూరి కోటేశ్వరరావు, బాబు, జ్యోతి జార్జి తదితరులు పాల్గొన్నారు.

## శంకరాపురం పరిధిలో కరెంటు కోతలతో ఇక్కట్లు

కడప కార్పొరేషన్ : శంకరాపురం సబ్ స్టేషన్ పరిధిలో కరెంటు కోతలు ఎక్కువగా ఉన్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అని తేడా లేకుండా ఎడా పెడా కరెంట్ కట్ చేస్తున్నారని స్థానిక ప్రజలు చెబుతున్నారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉందని, దీనివల్ల తాగునీటి అవసరాలకు, ఇతర పనులకు ఇబ్బంది కలుగుతోందని, ఒక సారి కరెంటు పోతే ఓ పట్టాన రావడం లేదని అంటున్నారు. ప్రతి వారంలో శనివారం మాత్రమే విద్యుత్ మరమ్మతులు చేసి, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తారు. ఇతర రోజుల్లో లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ)లు ఇచ్చినా వెంటనే కరెంట్ సరఫరా చేస్తారు. అందుకు విరుద్ధంగా శంకరాపురం సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతోందని వారు పేర్కొంటున్నారు. దీనిపై వివరణ కోరేందుకు సంబంధిత ఏఈకి ఫోన్ చేయగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

## బహుముఖ ప్రజ్ఞగల కళాకారుడు 'సంజీవ్ దేవ్'

కడప కల్చరల్ : ప్రముఖ చిత్రకారుడు, కవి, తత్వవేత్త, కళాకారుడు డాక్టర్ సూర్యదేవర సంజీవ్‌దేవ్ బహుముఖ ప్రజ్ఞగల వారని బ్రౌన్ పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి అన్నారు. సంజీవ్‌దేవ్ 110వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ సంజీవ్‌దేవ్ తెలుగు వారు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు మాట్లాడుతూ సంజీవదేవ్ మంచి చిత్రకారుడని, విశ్వకవి రవీంద్రుని కలిసిన అనంతరం బెంగాలి సాహిత్యం, చిత్రకళపై పట్టు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, మౌనిక, సిబ్బంది నీలకంఠేశ్వర్, రాణి, సుమతి, అరుణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డయేరియాను కలిసికట్టుగా అరికడదాం



నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

జమ్మలమడుగు : పట్టణంలో డయేరియా నివారణకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ శానిటేషన్ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. వాతావరణం మార్పుతో నీరు కలుషితం కావడం వల్ల ప్రజలకు డయేరియా వ్యాధి ప్రబలే అవకాశం ఉండటంతో శానిటేషన్ అధికారులు ప్రజలకు నీటిని సరఫరా చేసే ట్యాంకులను శుభ్రం చేయించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎస్సీ బాలుర వసతి గృహం, ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ, వసతి గృహాలను పరిశీలించారు.

## తైక్వాండో పోటీల్లో విద్యార్థుల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థినులు మహిథ, ధాత్రిన్

ప్రొద్దుటూరు : విశాఖపట్నంలో జూన్ 29, 30, జూలై 1న జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో స్థానిక విన్ తైక్వాండో అకాడమి విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు కోచ్‌లు కమల్, సంతోష్ తెలిపారు. మహిత, ధాత్రిన్ తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపి రెండు రజత పతకాలు సాధించారని తెలిపారు. వీరిని కోచ్‌లతోపాటు ఏపీఎస్‌పీడీసీఎల్ బీసీ సంఘం అధ్యక్షుడు మురళిమోహన్, తల్లిదండ్రులు అభినందించారు.

### హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించారు. స్వామివారికి మూడు నెలల 15 రోజులకు గాను భక్తులు రూ.1,34,924 కానుకల రూపంలో సమర్పించారు. కార్యక్రమంలో రాజంపేట దేవాదాయ ఇన్‌స్పెక్టర్ సి.శివయ్య, ఈఓ రమణారెడ్డి, ఆలయ ఛైర్మన్ ఎస్.సత్యనారాయణ, అర్చకులు మధుసూదనాచార్యులు పాల్గొన్నారు.

### జాంబవంతుడికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకమ్మనగర్‌లో వెలసి వున్న జాంబవంతుడి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. భక్తులు జాంబవంతుడిని దర్శించుకుని అర్చనలు, అభిషేక పూజలు చేశారు.